క్లుప్తంగా

పల్లె వెలుగు బస్సులు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాదరావు

కొత్తూరు: గ్రామీణ ప్రాంతాలకు గతంలో ఉండే ఆర్టీసీ పల్లె వెలుగు సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్‌రావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పూతికవలస గ్రామంలో గిరిజనులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కొత్తూరు నుంచి గొట్టిపల్లి, లబ్బ, పూతికవలస, అంగూరు, కడుము, దిమిలితోపాటు పలు రూట్లలో ఆర్టీసీ సర్వీసులు ఉండేవన్నారు. ప్రస్తుతం ఈ రూట్లలో బస్సులు లేకపోవడంతో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఇచిత బస్సు పథకం వల్ల ఉపయోగం ఉండటం లేదన్నారు.

'చింతాడ'కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


అవార్డు అందుకుంటున్న వెంకటరమణ

జలుమూరు: మండలంలోని రాణ పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన చింతాడ వెంకటరమణ శనివారం విజయవాడలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రోస్పర్టీ అసోసియేషన్ తరఫున జాతీయ ఉన్నత విద్యామండలి ప్రొఫెసర్, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు అందించారు. హర్‌గోపాల్ బీఈడీ కాలేజీలో ఉత్తమ బోధనకు ఈ అవార్డు వచ్చిందని వెంకటరమణ తెలిపారు. వెంకటరమణను పలువురు అభినందించారు.

ఆర్థికసాయం


భాస్కరరావు భార్యకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పొందూరు: పొందూరుకు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థి నక్క భాస్కరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న 1974–75 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మృతుడు భాస్కరరావు భార్యకు రూ.15 వేలను శనివారం అందజేశారు. నగదు అందించిన వారిలో సందుల రామకృష్ణ, ధర్మరాజు, ఉయ్యూరు దుర్గాప్రసాద్, పేర్ల కృష్ణ, నాళం మూర్తి, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: గ్రామీణ నిరుద్యోగులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సెంటర్ ఆధ్వర్యంలో వివిధ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ట్రస్ట్ ఇన్‌చార్జి ఎం.రామ్మూర్తి శనివారం తెలిపారు. పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న వైటీసీలో నాలుగు నెలలపాటు ఉచితంగా హాస్టల్, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. కంప్యూటర్ బేసిక్, ఎంఎస్ ఆఫీస్, స్పోకెన్ ఇంగ్లీష్, పెర్సనల్ డవలప్‌మెంట్ స్కిల్స్, సోలర్ పీవీ ఇన్‌స్టాలర్స్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసై ఉండాలి, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. 105 సీట్లు మాత్రమే ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 8249089248, 8106563073 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

16న మండల సమావేశం

బూర్జ: ఈ నెల 16వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షత వహిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్

కొత్తూరు: కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లోని 37 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ కేంద్రాలు అప్‌గ్రేడ్ కానున్నాయని స్థానిక సీడీపీఓ ఉమాజానికి శనివారం తెలిపారు. అప్‌గ్రేడ్ అయిన కేంద్రాలకు సహాయకుల పోస్టులను ప్రభుత్వం త్వరలో భర్తీ చేస్తోందన్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందాయన్నారు. తామరగూడ, పెనుగోటివాడ, ఎన్నిరామన్నపేట, బడిగాం, అడ్డంగి, శ్రీనివాసనగర్, పొందర కాలనీ, కొత్తగార్లుపాడు, ఆల్తి, జన్నొడుగూడ, ఇరపాడుగూడ, పెద్దమడి, కొండూరు, దొందమానుగూడ, కుంచాలపేట, మామిడిజోల, బొండి, కూర్మవలస, బొడ్డగూడ, ఎంజేపురం, నాయుడుగూడ, సంగన్నగూడ, ఎగువదొండ మానుగూడ, దిగువకిరిడి, గులుమూరు, జగన్నాథపురం, గుర్రాలమెట్ట, గొలుగుప్ప, కోపిరిగూడ, అత్తిలి, గొట్టిపల్లి, పుట్టిగాం, తాల్లపాడు, వీరనారాయణపురం, పెద్దొగూడ, దాసుగూడ కేంద్రాలు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మారనున్నాయి.

అన్నదాతలపై.. అదనపు భారం


ఆమదాలవలస రైల్వే గూడ్స్ షడ్ నుంచి లారీల ద్వారా యూరియాను తరలిస్తున్న దృశ్యం

- అరకొరగా అందుతున్న ఎరువులు
- రైతులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ఆమదాలవలస రూరల్: కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు అసలు సంబంధం ఉండటం లేదు. రైతులందరికీ ఎరువులు అందిస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా ఇంతవరకు యూరియా అందని పరిస్థితి నెలకొంది.

ఈ భారం ఎవరు మోస్తారు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు కావాల్సిన విత్తనాలతోపాటు కాంప్లెక్స్, యూరియా వంటి ఎరువులు నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎమ్మార్పీ ధరలకు అందించారు. కూటమి ప్రభుత్వం మాత్రం అన్నదాతలకు తొలివిడత ఎరువులు అరకొరగా రైతు సేవా కేంద్రాల ద్వారా అందించింది. అనంతరం నేతల చేతులకు ఎరువులు చేరి అధికార పార్టీ కార్యకర్తలకు అందించటం ఆశ్చర్యం కల్పిస్తోంది. వ్యవసాయశాఖ నిబంధనల మేరకు ఒక రైతుకు ఒకటి నుంచి రెండు బస్తాల యూరియా మాత్రమే మండల కేంద్రం నుంచి అందిస్తున్నారు. ఆ బస్తాలను గ్రామాలకు తరలించేందుకు రైతులపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. ప్రైవేట్ దుకాణాల్లో యూరియా రూ.550 నుంచి రూ.650, కాంప్లెక్ ఎరువులు రూ.1800 నుంచి రూ.2,000 కొనుగోలు చేసి ఆటో ద్వారా తరలించేందుకు రూ.100 నుంచి రూ.150 అదనంగా ఖర్చు అవుతోంది. వాస్తవంగా ఈ ఖర్చు వ్యవసాయశాఖాధిరులు భరించాలి. ఇదే రెండు బస్తాల యూరియా ప్రభుత్వం అందిస్తే రూ.450 నుంచి రూ.400 ఖర్చు అవుతోంది.


ఆమదాలవలస రైల్వే ప్లాట్ ఫారంపై యూరియా నిల్వలు

సకాలంలో అందని ఎరువులు..

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నప్పటికీ అవి కూడా వ్యవసాయశాఖాధికారులు సకాలంలో అందించకపోవటంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పటంలేదు. ముఖ్యంగా పల్లపు ప్రాంతాలకు చెందిన రైతులు సకాలంలో ఎరువులు వేసుకోలేకపోతే ఆ పంట దిగుబడి వచ్చి పరిస్థితి లేదు. ఈ ఏడాది చాలా మంది రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. వరి పంట పొలానికి ఎరువులు వేయకపోతే ఆపరాల పంటల దిగుబడి కూడా తగ్గే ప్రమాదం ఉంది. కూటమి పాలకులు తీసుకున్న అడ్డగోలు నిర్ణయాల వల్ల అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఏది ఎలా ఉన్న రైతులకు ఎరువులు అందించటంలో ఆ శాఖాధికారులు పూర్తిగా విఫలం అయ్యారని చెప్పటానికి క్షేత్రస్థాయి పరిస్థితులే ఇందుకు అద్దం పడుతున్నాయి. ఇప్పటికైౖ నా జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందించి, అన్నదాతను ఆదుకోవటమే కాకుండా ఆర్థిక భారం పడకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ప్రభుత్వం విఫలం



రైతులను ఆదుకోవటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఎరువుల కొరత ఉన్నా ఈ ప్రభుత్వం స్పందించడం లేదు. వచ్చిన ఎరువులు కూడా టీడీపీ నాయకుల అనుమతితో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చెప్పినవారికే అందించటం చాలా అన్యాయం. ఇటువంటి దారుణ పరిపాలన మునుపెన్నడూ చూడలేదు. చాలా మంది అధికారులు కూడా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలికి, వారు చెప్పిన వారికే ఎరువులు అందించటం వల్ల నిరుపేద రైతులు కంటతడి పెడుతున్నారు. రానున్నకాలంలో వ్యవసాయం చేయటానికి కూడా ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేదు. రానున్న కాలంలో కూటమి ప్రభుత్వంపై రైతులు తీవ్రస్థాయిలో తిరుగుబాటు చేసి బుద్ధి చెప్పటం ఖాయం.

– కోట గోవిందరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, ఆమదాలవలస

చంద్రబాబు మహిళా వ్యతిరేకి


- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి

హిరమండలం: మహిళలను సీఎం చంద్రబాబు దారుణంగా వంచించారని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. మహిళల ఓట్ల కోసం చంద్రబాబు ఎన్నో హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని తుంగలోకి తొక్కారని మండిపడ్డారు. ముఖ్యంగా ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 అందిస్తామని చెప్పారని, కానీ అది ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాల్సి ఉంటుందని జిల్లాకు చెందిన మంత్రి ప్రకటన చూస్తుంటే వారి చిత్తశుద్ధి ఎంతవరకు ఉందో అర్థమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలను మహరాణులను చేశారన్నారు. నేడు వారందర్నీ లేనిపోని హామీలు ఇచ్చి చంద్రబాబు ఓటు వేయించుకొని మోసం చేశారని మండిపడ్డారు.

రాష్ట్రంలో మహిళల పట్ల దారుణాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన పథకాలను సైతం చంద్రబాబు సర్కారు రద్దు చేసిందన్నారు. మహిళలకు చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే వైఎస్సార్‌సీపీ తరఫున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

రసాభాసగా ఉపాధి హామీ గ్రామసభ


విచారణ నివేదిక చదవాలని కోరుతున్న ఫిర్యాదుదారులు

సారవకోట: మండలంలోని గొర్రిబంద గ్రామంలో శనివారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభ రసాభాసగా మారింది. ఈ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనుల నిర్వాహణతోపాటు బిల్లుల చెల్లింపులో అక్రమాలు చోటుచేసుకున్నాయని స్థానికులు పలువురు ఇదివరకే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం స్థానిక సచివాలయంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. ఈ అక్రమాలపై సంబంధిత సామాజిక తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలో చదివి వినిపించడంతో గందరగోళం చోటుచేసుకుంది. ఫిర్యాదుదారులు శుక్రవారం నాటి విచారణ నివేదికను గ్రామసభలో చదవాలని కోరారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని ఏపీఓ నారాయణరావు తెలియజేశారు. ఉపాధి అక్రమాలపై మరింత లోతైన దర్యాప్తు చేయాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ సూర్యనారాయణ, సర్పంచ్ రూపావతి, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్, మాజీ సర్పంచ్ పల్లి కృష్ణారావు, ఉప సర్పంచ్ మొయ్యి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు ఎలా మార్చుకోవాలి సారూ...?



ఇది పోలాకి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు దుస్తులు మార్చుకునే గది. ఇందులో ఇన్వర్టర్‌తోపాటు ఇతర విద్యుత్ ఉపకరణాలను ఉంచారు. దీంతో ఆస్పత్రిలో అత్యవసర వైద్యం, ఆపరేషన్ తదితర సమయాల్లో ప్రధాన మౌలిక వసతి అయిన దుస్తుల మార్చేగదిని లేకుండా చేయటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై వెంటనే వైద్యాధికారులు స్పందించి దుస్తులు మార్చుకునేందుకు గదిని ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

– పోలాకి

ప్రమాదకరంగా ఫైబర్ వైర్లు



పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఏదురుగా ఉన్న శివానీనగర్‌కు 1 నుంచి 4 లైన్ వెళ్లే రోడ్డులో ఫైబర్‌వైర్లు రెండు అడుగుల ఎత్తులో వేళాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. శివానీనగర్‌కు రాకపోకలు చేసే వాహనదారులు, నడిచి వచ్చే వారికి ఫైబర్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫైబర్ వైర్లను విద్యుత్ స్తంభాలకు కట్టించాలని వాహనదారులు, ప్రజలు కోరుకుంటున్నారు.

– పాతపట్నం

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


హిరమండలం: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ చంద్రమౌళి


పాతపట్నం: హిందీ దివస్ అక్షరాల ఆకారంలో విద్యార్థులు

పాతపట్నం: జాతీయ భాష హిందీని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు రత్న కుమారి అన్నారు. పాతపట్నం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు హిందీ దివస్ ఆకారంలో కూర్చున్నారు.

హిందీ రాజ భాష

హిరమండలం: హిందీ దేశ భాష అని ఎంఈఓ చంద్రమౌళి అన్నారు. ఎల్.ఎన్.పేట మండలం కొవిలాం ప్రాథమిక పాఠశాలలో హిందీ దివాస్‌ను హిందీ ఉపాధ్యాయుడు పెద్దకోట వెంకటరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. హిందీ భాష నేర్చుకోవడం అత్యంత ఆవశ్యకమని ఎంఈఓ అన్నారు. అన్నింటి కంటే హిందీ భాష సులువైనదని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గజపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ కానుకల లెక్కింపు రేపు

పాతపట్నం: ఈ నెల 15వ తేదీన మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయ హుండీ కానుకలను లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు శనివారం తెలిపారు. దేవదాయశాఖ అధికారులు, భక్తుల సమక్షంలో ఉదయం పది గంటల నుంచి లెక్కించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు డ్రస్ కోడ్ పాటించి పాల్గొనవచ్చున్నారు.

రాజీయే రాజమార్గం


పొందూరు: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి బి.జ్యోత్స్న


కొత్తూరు: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కె.రాణి


పాతపట్నం: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సివిల్ జడ్జి శ్రీధర్


నరసన్నపేట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి వాణి

నరసన్నపేట: మండల కేంద్రంలోని సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 111 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి తెలిపారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లోని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులు ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరమైనట్లు తెలిపారు.

182 కేసులు పరిష్కారం..

కొత్తూరు: పలు కేసుల్లో కోర్టులు చుట్టూ తిరుగుతున్న కక్షదారులు కేసులు రాజీ చేసుకోవడం మంచిదని స్థానిక మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షురాలు, కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.రాణి అన్నారు. కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 182 కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్ సభ్యులు, కొత్తూరు, బత్తిలి, హిరమండలం పోలీసులు పాల్గొన్నారు.


206 కేసులు పరిష్కారం..

పొందూరు: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 206 కేసులు పరిష్కారమయ్యాయి. 9 సివిల్ కేసులు, 25 క్రిమినల్ కేసులు, 40 మోటార్ వెహికల్ కేసులు, ఇతర కేసులను పరిష్కరించినట్లు జడ్జి బి.జ్యోత్స్న తెలిపారు. న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

69 కేసులు పరిష్కారం..

పాతపట్నం: పాతపట్నంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 69 కేసులను పరిష్కరించినట్లు శ్రీకాకుళం కోర్టు సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, జూదం కేసులు 37, ఎక్సైజ్ కేసులు 23, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు 8తోపాటు మరో కేసు పరిష్కరించారు. కక్షిదారుల నుంచి అపరాధ రుసుం, షెటిల్‌మెంట్ ద్వారా రూ.5,71,240 వసూలైందన్నారు. లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, పాతపట్నం ఎస్ఐ లావణ్య, ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసరావు, సారవకోట పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం..


అనుబంధ కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య సూచించారు. శనివారం నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో ఇటీవల పార్టీ అనుబంధ విభాగం కార్యవర్గ సభ్యులుగా నియమితులైన ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జన్ని అనిరుద్రుడు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సతివాడ రామినాయుడు, జిల్లా కార్యదర్శి కోటిపల్లి శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు ఉంకిల్ గోపాలకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ పదవులు బాధ్యతగా నిర్వహించి గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, 2029 సాధారణ ఎన్నికల్లో ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ నెల 17న శ్రీకాకుళంలో జరగనున్న ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరుకావాలన్నారు. స్థానిక సర్పంచ్ బి.శంకరరావు, డీఎల్ పురం మాజీ సర్పంచ్ కాళ్ల సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు..


తమ్మినేని సీతారాంను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న చింతు విజయ

ఆమదాలవలస: మున్సిపాలిటీ 22వ వార్డు వెంగళరావు కాలనీకి చెందిన చింతు విజయకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం జిల్లా కల్చరల్ వింగ్ సెక్రటరీగా నియమించింది. మాజీ స్పీకర్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు తమ్మినేని సీతారాంను ఆమదాలవలసలోని ఆయన నివాసం వద్ద శనివారం విజయ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, తమ్మినేనికి కృతజ్ఞతలు తెలిపారు. విజయకి తమ్మినేని అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి


గండివలస పృథ్వీరాజ్

సరుబుజ్జిలి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీ గండివలస పృథ్వీరాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో యువజనులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై పనిచేయడం జరుగుతుందని వెల్లడించారు. పార్టీలో యువత ప్రధాన భూమిక వహించేలా బాధ్యత తీసుకుంటానన్నారు. తనకు ఈ పదవి అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ముద్దాడకు అభినందన


ముద్దాడ ఈశ్వరరావును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామానికి చెందిన ముద్దాడ ఈశ్వరరావుకు వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడిగా పార్టీ నియమించింది. ఆయనకు పార్టీ మండల నాయకులు అభినందనలు తెలియజేశారు. శనివారం మదనాపురం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో సన్మానించారు. కొల్లివలస గ్రామ సర్పంచ్ జీడి వేణు, నాయకులు జి.సుధాకర్, నున్నగొప్పల రామకృష్ణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ..


జలుమూరు: సురేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు


పాతపట్నం: లింగాల రవి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ కాపు వీధికి చెందిన లింగాల రవి ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు. రవి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, నాయకులు పనుకు మోహన్, గోకవలస రాము, టంకాల సుధ, సలాన చిరంజీవి, చీకటి పద్మరాజు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ లైన్‌మన్ కుటుంబానికి..

జలుమూరు: పాగోడు గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌మన్ మామిడి సురేష్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య శనివారం పరామర్శించారు. ఇంటికి ఆసరాగా ఉండే వ్యక్తి మృతి చెందడం బాధాకరమన్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, పార్టీ నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు దామ మన్మధరావు, ఎంపీటీసీ రావాడ చందనబాబు, పంగ రామకృష్ణ, మంత్రి అప్పన్న తదితరులు ఉన్నారు.

కొండాల కుటుంబానికి..

సారవకోట: మండలంలోని చిన్నగుజ్జువాడ గ్రామానికి చెందిన కొండాల లక్ష్మీనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సర్పంచ్ కొండాల బాబూరావు, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, ముద్దాడ బైరాగినాయుడు, గొర్లె ఢిల్లీరావు తదితరులు ఉన్నారు.

రైలు ఢీకొని రెండు మేకలు మృతి

- ఆవు దూడకు తీవ్రగాయాలు


ఆవు దూడకు వైద్యం చేస్తున్న పశువైద్యుడు అనిల్‌కుమార్

పాతపట్నం: పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో పూరి నుంచి గుణుపూర్ వెళ్తున్న రైలు ఢీకొన్న సంఘటనలో రెండు మేకలు మృతి చెందాయి. ఆవు దూడకు తీవ్రగాయాలయ్యాయి. శనివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే ట్రాక్ సమీపంలో మేకల మంద ఉంది. మందలోని రెండు మేకలు ట్రాక్‌పై ఉండడంతో ప్రమాదం జరిగింది. పశువైద్యుడు పారశెల్లి అనిల్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకుని ఆవు దూడకు వైద్యం అందించారు. మృతి చెందిన రెండు మేకలు కొరసవాడకు చెందిన వారివిగా చెబుతున్నారు.